క్లుప్తంగా

కిష్టంపల్లి చెరువు గండి.. మరమ్మతు కరువు



మరికల్: మండల పరిధిలోని కిష్టంపల్లి సున్న పురాళ్ల కుంటకు గండి పడి ఏళ్లు గడుస్తోంది. ఇంత వరకు గండి మరమ్మతులు చేయకపోవడంతో వర్షాపునీరు వృథాగా పోతుంది. దీంతో చెరువు కింద ఉన్న వ్యవసాయ బోర్లలో వేసవిలో భూగర్భజలాలు అడుగంటిపోవడంతో పంటలు ఎండుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి గండిని మరమ్మతులు చేయాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువుకు పడ్డ గండిని మరమ్మతులు చేయాలని ఆయా కట్టు రైతులు, గ్రామస్తులు కోరుతున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



మాగనూర్: మండల పరిధిలోని వర్కూర్ గ్రామ పెద్దవాగు నుంచి అక్రమ ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను మంగళవారం స్థానిక పోలీసులు పట్టుకున్నారు. ఏఎస్ఐ మన్నన్ తెలిపిన వివరాలిలా.. మక్తల్ మండలం దాసర్‌దొడ్డి గ్రామానికి చెందిన చిన్న రాముల అంజప్ప అనే వ్యక్తి వర్కూర్ పెద్దవాగు నుంచి ఇసుక అక్రమంగా మక్తల్‌కు తరలిస్తుండగా ఇసుక ట్రాక్టర్ పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించి, ట్రాక్టర్ యాజమానిపై కేసునమోదు చేసినట్లు ఏఎస్ఐ మన్నన్ తెలిపారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

బోర్డు ఏర్పాటు



మరికల్: మండల కేంద్రంలో బస్టాండ్ ఎదురుగా ఉన్న స్థలంలో ఆర్టీసీ సిబ్బంది మంగళవారం బోర్డు ఏర్పాటు చేశారు. గత ప్రభుత్వం మరికల్‌లో బస్టాండ్ ఎదురుగా ఉన్న సర్వే నంబర్ 1లో ఉన్న ఎకరా స్థలాన్ని ఆర్టీసీ సంస్థకు అప్పగించింది. ఈ మధ్యకాలంలో ఈ స్థలం కబ్జాకు గురవుతున్నట్లు గ్రామస్తులు ఆందోళనలు చేయడంతో ఎట్టకేలకు స్పందించిన ఆర్టీసీ అధికారులు ఈ స్థలం తమదంటు వారి పేరుతో కూడిన బోర్డును ఏర్పాటు చేశారు.

వీధి కుక్కల దాడిలో చిన్నారికి గాయాలు

ధన్వాడ: మండల కేంద్రంలో వీధి కుక్క దాడిచేయడంతో చిన్నారికి తీవ్ర గాయలయ్యాయి. మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన మురళి కూతురు దీపిక(6) ఇంటి ముందు ఉన్న చెట్టు వద్ద ఆడుతుండగా వీధికుక్క చిన్నారిపై దాడి చేయడంతో ముఖ భాగంలో తీవ్రంగా గాయపరిచింది. దీంతో వెంటనే స్థానిక ప్రభుత్వ అస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స నిర్వహించిన అనంతరం డాక్టర్లు మహబూబ్‌నగర్ జిల్లా ఆస్పత్రికి రెఫర్ చేయడంతో కుటుంబసభ్యులు 108 వాహనంలో తరలించారు.

తపాలా శాఖలో గ్రేడ్-1 పోస్టుమాస్టర్ల బదిలీలు

ఖమ్మంగాంధీ చౌక్: రాష్ట్రంలోని ఐదు హెడ్ పోస్టాఫీసుల్లో పనిచేసే హయ్యర్ సెలక్షన్ గ్రేడ్-1(హెచ్ఎస్‌జీ-1) పోస్టుమాస్టర్లను బదిలీ చేస్తూ హైదరాబాద్ ప్రాంతీయ పోస్టు మాస్టర్ జనరల్ సుమిత అయోధ్య మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా ఖమ్మం హెడ్ పోస్టాఫీస్ హెచ్ఎస్‌జీ గ్రేడ్-1 పోస్టుమాస్టర్ కె.కిరణ్‌కుమార్‌రెడ్డిని వరంగల్ హెడ్ పోస్టాఫీసుకు బదిలీ చేశారు. అలాగే, హన్మకొండ హెడ్ పోస్టాఫీస్ పోస్టు మాస్టర్ కె.సుబ్రమణ్యంను ఖమ్మంకు, హన్మకొండ హెడ్ పోస్టాఫీస్‌లో డీపీఎం(ఎస్‌బీ) పోస్టుమాస్టర్ ఎం.సురేష్‌బాబును మహబూబ్‌నగర్ హెడ్ పోస్టాఫీస్ పోస్టుమాస్టర్‌గా, కరీంనగర్ హెడ్ పోస్టాఫీస్ డీపీఎం(ఎస్‌బీ) పోస్టుమాస్టర్ కేవీ.పవన్‌కుమార్‌ను హన్మకొండ హెడ్ పోస్టాఫీస్ పోస్టుమాస్టర్‌గా, వరంగల్ హెడ్ పోస్టాఫీస్ డీపీఎం (మెయిల్స్) పోస్టుమాస్టర్ ఏ.తిరుపతిని కరీంనగర్ హెడ్ పోస్టాఫీస్ పోస్టుమాస్టర్‌గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇదిలా ఉండగా మరో ఇద్దరు పోస్టుమాస్టర్లకు హయ్యర్ సెలక్షన్ గ్రేడ్-1 పోస్టుమాస్టర్లుగా(హెచ్ఎస్‌జీ-1) పదోన్నతి కల్పించడమే కాక బదిలీ చేశారు. నిజామాబాద్ హెడ్ పోస్టాఫీస్‌లో పోస్టుమాస్టర్లు(హెచ్ఎస్‌జీ-2)గా పనిచేస్తున్న జి.గంగాధర్‌కు హెచ్ఎస్‌జీ-1గా ఉద్యోగోన్నతి కల్పించి ఆదిలాబాద్ హెడ్ పోస్టాఫీస్‌కు, కె.అజయ్‌కుమార్‌ను నిజామాబాద్ హెడ్ పోస్టాఫీస్‌లోనే హెచ్ఎస్‌జీ-1గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

బీజేపీ నాయకుల సంబరాలు


మక్తల్‌లో విజయోత్సవ సంబరాల్లో బీజేపీ నాయకులు

నారాయణపేట రూరల్: పాలమూరు గడ్డపై కమల వికాసమే ధ్యేయంగా చేసిన కృషి ఫలితాన్ని అందించిందని బీజేపీ మండల అధ్యక్షుడు సాయిబన్న అన్నారు. మండలంలోని బైరంకొండలో మంగళవారం సాయంత్రం విలేకరులతో మాట్లాడుతూ.. బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని ప్రజలు నమ్మి ఓటేశారని, రాబోయే రోజుల్లో కేంద్రం నుంచి అవసరమైన నిధులు తీసుకుని వచ్చి అరుణమ్మ అభివృద్ధి చేపడుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో బీజేపీ జిల్లా నాయకులు రఘువీర్‌యాదవ్, శ్రీపాద్, కౌన్సిలర్లు సత్యరఘుపాల్‌రెడ్డి, బజరంగ్ దళ్ జిల్లా కోషాదికారి రణిమోది, అక్షయ్, సంతోష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

■ పట్టణంలోని శ్రీ సత్యనారాయణచౌరస్తాలో టీడీపీ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. డీకే అరుణ గెలుపుపై హర్షం వ్యక్తం చేస్తూ బాణాసంచా కాల్చి, మిఠాయిలు తినిపించుకున్నారు. కార్యక్రమంలో ఓంప్రకాష్, యాబన్నచౌద్రి, నారాయణ, భీమన్న, పెంటయ్య, వీరణ్ణ, బోజప్ప, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మక్తల్: పాలమూరు పార్లమెంట్ బీజేపీ ఎంపీ అభ్యర్థిగా డీకే. అరుణ గెలుపొందడం పట్ల మంగళవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు బాణాసంచా కాల్చి సంబరాలు నిర్వహించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

మద్దూరు: పాలమూరు ఎంపీ స్థానం బీజేపీ కైవసం చేసుకోవడంతో మద్దూరు, కొత్తపల్లి మండల కేంద్రాల్లో ఆ పార్టీ నాయకులు మంగళవారం సంబరాలు చేసుకున్నారు. అలాగే కొత్తపల్లి చౌరస్తాలో పార్టీ శ్రేణులు బాణాసంచా కాల్చి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో ఆ పార్టీ నాయకులు భరత్, సాయిలు, రఘు, వెంకటయ్య, విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

నర్వ: మహబూబ్‌నగర్ ఎంపీగా డీకే. అరుణ విజయం సాధించడంతో మంగళవారం మండల కేంద్రంలోని పార్టీనాయకులు సంబరాలు ఘనంగా నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో బీజేపీ పార్టీ కార్యకర్తలు బాణాసంచా కాల్చి, స్వీట్లు పంచారు. కార్యక్రమంలో వావిళ్ల రవికుమార్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, కృష్ణయ్య, వెంకటేశ్వర్‌రావు,రామకృష్ణ, వెంకటేష్, విజయ్‌కుమార్, రవీందర్‌రెడ్డి, హన్మంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధన్వాడ: పాలమూరు పార్లమెంట్ బీజేపీ ఎంపీ అభ్యర్థిగా డీకే. అరుణ గెలుపొందడంపై మంగళవారం మండల నాయకులు సంబరాలు నిర్వహించారు. అలాగే అగున్కుర్లలో బాణాసంచా కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మాకం సురేందర్, జిల్లా నాయకులు ఉదయభాను, మల్లప్ప, గోవర్ధన్‌గౌడ్, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాసులు, గోపి, రాంచంద్రయ్య, ఎర్రప్ప పాల్గొన్నారు.

ఊట్కూరు: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి డీకే. అరుణ గెలుపొందడంతో మండలంలోని ఊట్కూరు, కొల్లూరు, బిజ్వార్, పులిమామిడి, ఓబులాపూర్, అమీన్‌పూర్, పగిడిమారి తదితర గ్రామాల్లో బీజేపీ కార్యకర్తలు బాణాసంచా కాల్చి, మిఠాయిలు పంపిణీ చేశారు. భాస్కర్, కొల్లూర్ శంకర్‌రెడ్డి, ఎల్లారెడ్డి, విజయ్‌కుమార్, విజయన్‌గౌడ్, మహేష్‌గౌడ్, కుర్వ తదితరులు పాల్గొన్నారు.

మాగనూర్: పాలమూరు పార్లమెంట్ స్థానాన్ని కైవసం చేసుకున్న బీజేపీ అభ్యర్థి డీకే. అరుణ గెలుపు పట్ల మండల కేంద్రంలో బీజేపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బాణాసంచా కాల్చి..


మరికల్‌లో విజయోత్సవ సంబరాల్లో పాల్గొన్న బీజేపీ నాయకులు

మరికల్: మహబూబ్‌నగర్ ఎంపీగా డీకే. అరుణ విజయం సాధించడంతో మంగళవారం మండలంలోని బీజేపీ నాయకులు విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. అనంతరం బాణాసంచా కాల్చి స్వీట్లను పంచుకున్నారు. అలాగే మండలంలోని అన్ని గ్రామాల్లో బీజేపీ నాయకులు విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో నర్సన్‌గౌడ్, రాజేష్, వేణు, రామేశ్వర్‌రెడ్డి, రమేష్, మోహన్‌రెడ్డి, తిరుపతయ్య, నరేష్‌గౌడ్, మల్లేష్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.


మద్దూరులో..


నర్వలో..


మాగనూర్‌లో..


నారాయణపేటలో..


ఊట్కూరులో..


ధన్వాడలో..

విద్యార్థులకు నోట్‌పుస్తకాల పంపిణీ


చిన్నారులకు నోట్‌పుస్తకాలు అందిస్తున్న లయన్ సభ్యులు

నారాయణపేట రూరల్: పాటల ద్వారా తెలుగు భాషను ప్రపంచానికి తెలియజెప్పిన మహా గాయకుడు ఎస్పీ బాలసుబ్రమణ్యం అని ఎస్పీ బాలు ఫ్యాన్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మహిపాల్ రెడ్డి అన్నారు. స్థానిక బాలకేంద్రంలో మంగళవారం ఎస్పీ బాలు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి కేక్‌కట్ చేశారు. అనంతరం ఎస్పీ బాలు పాడిన పలు పాటలను పలువురు గాయకులు ఆలపించారు. వారిని శాలువా, పూలమాల, జ్ఞాపికతో సన్మానించారు. అంతకుముందు బాలు గాయకుడిగా అందించిన సేవలను కొనియాడారు. అనంతరం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, పెన్నులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ కో షాధికారి రవికుమార్‌గౌడ్, ప్రముఖ వైద్యులు డాక్టర్ గందె కార్తిక్, బాలకేంద్రం సూపరింటెండెంట్ మహిపాల్‌రెడ్డి, సంగ నర్సింహులు, రామకృష్ణ, లక్ష్మణ్, వసంత్ పాల్గొన్నారు.

నీట్‌లో విద్యార్థిని ప్రతిభ


బోగం సాయిప్రియ

ధన్వాడ: నీట్ ఫలితాల్లో ధన్వాడ విద్యార్థిని సాయిప్రియ సత్తాను చాటుకుంది. మంగళవారం వెలువడిన నీట్ ఫలితాల్లో సాయిప్రియ 720 గాను 535 మార్కులను సాధించుకుని సత్తాను చాటుకుంది. మండల కేంద్రానికి చెందిన శ్రీనివాసులు, లత కుమార్తె సాయిప్రియ మొదటి ప్రయత్నంలోనే నీట్‌లో ర్యాంకు సాధించడంపై పలువురు అభినందనలు తెలిపారు.

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



నర్వ: మండలంలోని కల్వాల్‌లో విద్యుత్ ట్రాన్స్‌పార్మర్‌లు ప్రమాదకరంగా మారాయని ఆయా కాలనీవాసులు వాపోతున్నారు. గ్రామంలోని వడ్డెర బస్తి, శ్రీరామ్‌నగర్ కాలనీలో అతీ సమీపంలో పిల్లలు, పశువులకు అందె ఎత్తులో ఉండడంతో కాలనీవాసులు భయంగా ఉన్నామన్నారు. తక్కువ ఎత్తులో ఉన్న ఈ ట్రాన్స్‌ఫార్మర్‌లను ఎత్తు పెంచి ప్రమాదాన్ని నిరోధించాలని వారంటున్నారు. కాలనీలోని విద్యుత్‌సరఫరా కోసం ఏర్పాటుచేసిన ఈ సింగిల్‌ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్‌ల ఎత్తు పెంచి ప్రమాదాన్ని నివారించాలని వారు కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


సన్మానం పొందిన గురువులతో పూర్వ విద్యార్థులు

కోస్గి: పట్టణంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో 2004సంవత్సరంలో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థులు మంగళవారం స్థానిక ఏబీకే ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు.అనంతరం తమకు విద్యాబోధన చేసిన గురువులను సన్మానించా రు. వివిధ రంగాల్లో స్థిరపడ్డవారు కొందరు, ఉద్యోగాలు చేస్తున్నవారు కలుసుకొని తమ సాధకబాధకాలను చర్చించుకుని మురిసిపోయారు. సన్మా నం పొందిన గురువులు సైతం ఇది జీవితంలో మరచిపోని ఘట్టంగా విద్యార్థులను అభినందించారు.

వంతెన నిర్మాణం ఇంకెప్పుడో..?


వరద దాటికి కొట్టుకుపోయిన వంతెన

మాగనూర్: మండల పరిధిలోని తళంకేరి – నేరడగండొడ్డి గ్రామాల మధ్య చిన్న వాగుపై గతంలో రాకపోకలు వంతెన నిర్మించగా అది కేవలం నెలల వ్యవధిలోనే కూలిపోవడంతో దాదాపుగా పది సంవత్సరాల నుంచి వంతెన పున:నిర్మాణ పనులు చేపట్టకపోవడంతో తీవ్ర ఇబ్బందులు తలెత్తున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. వంతెన లేకపోవడంతో రెండు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయని నేరడగండొడ్డి గ్రామస్తులు అవసరాల రిత్యా మండల కేంద్రానికి చేరుకోవాలంటే చుట్టు తిరిగి అధికంగా 14 కిలోమీటర్లు రావాల్సిన పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. దీంతో సమయం వృథాతోపాటు సకాలంలో పనులు కావడం లేదని, అధికారులు స్పందించి చిన్నవాగుపై వంతెన నిర్మించి ఇబ్బందులు తొలగించాలని కోరుతున్నారు.



జిల్లా కేంద్రంలో ఓట్ల లెక్కింపులో పాల్గొన్న సిబ్బంది, లెక్కింపు తీరును పరిశీలిస్తున్న ఏజెంట్లు

భారీ భద్రత మధ్య లెక్కింపు


ఓట్ల లెక్కింపు సందర్భంగా వివరాలను ఏజెంట్లకు చూపిస్తున్న సిబ్బంది



ఈవీఎంలను కౌంటింగ్ టేబుళ్ల వద్దకు తీసుకెళ్తున్న సిబ్బంది

మహబూబ్‌నగర్ క్రైం: మహబూబ్‌నగర్ పార్లమెంట్ కౌంటింగ్ సందర్భంగా జిల్లా పోలీస్ శాఖ యూనివర్సిటీలోని స్ట్రాంగ్ రూంలతోపాటు ఆవరణలో భారీ భద్రత కల్పించింది. మంగళవారం జిల్లాకేంద్రంలోని పీయూలో కౌంటింగ్ కేంద్రం చుట్టూ పరిసర ప్రాంతాలతోపాటు ఆవరణలో భారీ పోలీస్ భద్రత ఏర్పాటు చేశారు. కౌంటింగ్ ప్రారంభం కంటే ముందే ఉద్యోగులు, సిబ్బంది, పార్టీల ఏజెంట్లను గుర్తింపు కార్డులు, అధికారులు జారీ చేసిన పాస్‌లను చూసి పోలీసులు లోపలికి పంపించారు. ప్రధానంగా కౌంటింగ్ జరుగుతున్న భవనాలు అన్నింటిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. లెక్కింపు సందర్భంగా జిల్లా పోలీస్ శాఖ మూడు అంచెల భద్రత వ్యవస్థ ఏర్పాటు చేశారు. మూడు అంచెల భద్రత వ్యవస్థలో కేంద్ర బలగాలు, ఏఆర్, సివిల్ పోలీసులను ఉపయోగించారు. ఎస్పీ హర్షవర్ధన్‌తోపాటు ఏఎస్పీ రాములు, డీఎస్పీ వెంకటేశ్వర్లు కౌంటింగ్ కేంద్రాలను పర్యవేక్షించారు.

తనిఖీలపై ప్రత్యేక దృష్టి

పార్లమెంట్ ఎన్నికల ఫలితాల సందర్భంగా కౌంటింగ్ కేంద్రాల లోపలికి వెళ్తున్న ఎన్నికల సిబ్బంది, ఏజెంట్లు, మీడియా ప్రతినిధులు అందరినీ క్షుణ్ణంగా పరిశీలించారు. యూనివర్సిటీ ముఖద్వారం ప్రధాన గేట్ దగ్గర ప్రత్యేక భద్రత కల్పించి లోపలికి వెళ్తున్న వ్యక్తులతో సంబంధిత అధికారులు జారీ చేసిన పాస్ ఉన్నాయా.. లేదా అని ఒకటికి రెండు సార్లు తనిఖీ చేశారు. ప్రధానంగా కౌంటింగ్ భవనం లోపలికి వెళ్తున్న వ్యక్తులు సెల్‌ఫోన్, ఎలక్ట్రానిక్ వస్తువులను తీసుకువెళ్లడానికి అనుమతి ఇవ్వలేదు.

ట్రాఫిక్ జాం కాకుండా చర్యలు

పీయూలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ సెంటర్ ప్రధాన రహదారిపై ఉండటంతో ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక దృష్టిపెట్టారు. కేంద్రానికి వచ్చే వాహనాలు అల్లీపూర్ రోడ్డులో పార్కింగ్ కల్పించారు. కొందరు వ్యక్తులకు పీయూ పరిపాలన విభాగం దగ్గర కూడా పార్కింగ్ కల్పించారు. దీంతో రాయిచూర్ రోడ్డుపై ఉన్న పీయూ కేంద్రం దగ్గర ఎలాంటి ట్రాఫిక్ జాం కాకుండా చూశారు.

నీట్‌లో 'రిషి' విద్యార్థుల సత్తా


ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న రిషి యాజమాన్యం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రభుత్వం విడుదల చేసిన నీట్ ఫలితాల్లో జిల్లా కేంద్రంలోని రిషి అకాడమీ విద్యార్థులు జాతీయ స్థాయిలో సత్తా చాటారు. ఈ మేరకు అకాడమీకి చెందిన అనన్య 627 మార్కులు, మౌనిక 621, సఫాన్ సాద్ 610, సంతోష్ 600 మార్కులు సాధించినట్లు అకాడమీ కరస్పాండెంట్ చంద్రకళావెంకట్ పేర్కొన్నారు. 600లకు పైగా ఐదుగురు, 550 మార్కులు 20 మంది, 500లకు పైగా 50 మంది మార్కులు సాధించినట్లు తెలియజేశారు. తమ కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించడం గర్వంగా ఉందని, ఎక్కువ సంఖ్యలో మెడికల్ సీట్లు సాధించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థులను యాజమాన్యం అభినందించింది. కార్యక్రమంలో సలహాదారు వెంకటయ్య, డీస్ భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

'వాగ్దేవి' విజయకేతనం


ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని వాగ్దేవి కళాశాల విద్యార్థులు ప్రభుత్వం విడుదల చేసిన నీట్ ఫలితాల్లో జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చారు. ఈ మేరకు నీట్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ వెంకట్‌రెడ్డి మాట్లాడారు. మా విద్యార్థులకు జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో పోటీ పడేలా తీర్చిదిద్దామని, ఇన్నొవేటివ్ సైంటిఫిక్ టీచింగ్ అప్రోచ్ కార్యక్రమం ద్వారా ప్రత్యేక బోధన చేశామన్నారు. కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించి తల్లిదండ్రులు, జిల్లా పేరును నిలబెట్టారన్నారు. ఈ మేరకు కళాశాలకు చెందిన 30 నుంచి 45 మంది విద్యార్థులు మెడికల్ సీట్లు సాధించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గీతాదేవి, ఐఐటీ, నీట్ అకాడమీ ఇన్‌చార్జ్ పావని, యాకుబ్, షాకీర్, శివకుమార్, రాఘవేందర్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.